సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 26 । మార్చి । 2023



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కొత్తపల్లి మురళీమోహనరావు (తణుకు మండలం పైడిపర్రు) రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో భక్తుల రాక తగ్గింది.

29న ఇంటర్వ్యూలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 29న ఉద్యోగాల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు సెల్ 88868 82032, 91827 72465 నంబర్లలో సంప్రదించవచ్చు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహరి
	ఆదివారం సాయంత్రం	సోమవారం వేకువజాము
భీమవరం	6.23	4.43
తాడేపల్లిగూడెం	6.25	4.51
నరసాపురం	6.22	4.41

న్యూస్‌రీల్

30 నుంచి క్షీరారామంలో కల్యాణోత్సవాలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వార్ల సాప్తాహ్నిక కల్యాణోత్సవాలను ఈనెల 30 నుంచి వచ్చేనెల 5 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కల్యాణోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. 1వ తేదీ వేకువజామున స్వామి వార్ల కల్యాణం, ఆదేరోజు మధ్యాహ్నం రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ రాత్రి పుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని, 16న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయ ఈఓ యాళ్ల సూర్యనారాయణ, సిబ్బంది, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యాన ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ

తాడేపల్లిగూడెం: గ్రామీణ మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకిరామ్ కోరారు. ఆర్యా ప్రాజెక్టు కింద శనివారం వర్సిటీ ప్రధాన గేటు వద్ద ఏర్పాటుచేసిన ఉద్యాన ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కృషి మహిళా రైతు ఉత్పత్తిదారులు సంఘంగా ఏర్పడి మహిళలు ప్రారంభించిన విక్రయ కేంద్రం లాభాలతో సాగాలని ఆకాంక్షించారు. వర్సిటీ అధికారులు పద్మావతమ్మ, సలోమిసునీత, ఈ.కరుణశ్రీ, వెంకటస్వామి, సూర్యకుమారి, ధనుంజయరావు పాల్గొన్నారు.

అక్రమ మందుల విక్రయాలపై చర్యలు



సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా, లైసెన్స్ లేకుండా మందులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. భీమవరంలోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ఔషధ నియంత్రణ శాఖ, పోలీస్, వైద్యారోగ్యశాఖ, రెవెన్యూ అధికారులతో జిల్లాలో ఔషధ నియంత్రణపై శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. పోలీసులు, డ్రగ్ కంట్రోల్ అధికారులతో బృందాలను ఏర్పాటుచేసి ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎస్పీ యు.రవి ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో అనధికార ఔషధాల నిల్వలు, విక్రయాల నియంత్రణకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ ఎస్.విజయకుమార్, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, ఆర్డీఓ దాసి రాజు, తణుకు, భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు షేక్ అబిద్ అలీ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నారీలోకం.. నీరాజనం

నిండైన ఆశీస్సులు

- అక్కచెల్లెమ్మల ఆనందోత్సాహాలు
- దెందులూరు సభకు పోటెత్తిన ఆడపడుచులు
- వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు జమ
- బటన్ నొక్కి ప్రారంభించిన సీఎం జగన్
- నియోజకవర్గంలో రూ.200 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన



దెందులూరులో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్, మంత్రులు కొట్టు, కారుమూరి, వనిత, రోజా, ఉషశ్రీచరణ్, ముత్యాలనాయుడు, విశ్వరూప్, చీఫ్‌విప్ ముదునూరి, ఎంపీలు మిథున్‌రెడ్డి, కోటగిరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి ప్రతినిధి,ఏలూరు/ ఏలూరు మెట్రో: అశేషంగా అక్కచెల్లెమ్మలు తరలివచ్చి ఆశీర్వదించారు.. దెందులూరు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మహిళలు పోటెత్తారు.. శనివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు జమ పథకాన్ని దెందులూరులో సీఎం జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభకు మహిళలు భారీగా తరలివచ్చారు. ఉదయం 10.30 గంటలకు దెందులూరులో హెలీప్యాడ్‌కు చేరుకున్న సీఎం జగన్‌కు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి బహిరంగ సభా ప్రాంగణానికి సీఎం జగన్ చేరుకుని డీఆర్‌డీఏ, మెప్మా, దిశా స్టాల్స్‌ను పరిశీలించి డ్వాక్రా సంఘాలు తయారుచేసిన ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి డ్వాక్రా మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడారు. సభలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రసంగించారు. అనంతరం ఇద్దరు పొదుపు సంఘాల మహిళలు పథకాల ద్వారా వారికి కలిగిన లబ్ధిని తీవ్ర ఉద్వేగంతో ముఖ్యమంత్రికి విన్నవించారు. అనంతరం సీఎం జగన్ సుదీర్ఘంగా ప్రసంగించారు.

ఆనందాల సెల్ఫీ : సభావేదికపై రాష్ట్ర మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సీఎం జగన్‌తో సెల్ఫీ దిగారు.

గ్రాండ్ సక్సెస్ : ముఖ్యమంత్రి సభకు అశేష జనవాహిని పోటెత్తింది. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు రోడ్డుకిరువైపులా ప్రజలు బారులు తీరారు. ప్రజలందరికీ బస్సు నుంచి అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రజలకు చిన్నపాటి అసౌకర్యానికి కూడా తావులేకుండా ప్రాంగణంలో మంచినీటి సదుపాయంతో పాటు ప్రత్యేక వైద్యశిబిరాన్ని అందుబాటులో ఉంచారు. పలు నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలివచ్చారు. రాష్ట్ర మంత్రులు కొట్టు సత్యనారాయణ, పినిపే విశ్వరూప్, కారు మూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, ఆర్‌కే రోజా, ఉషశ్రీ చరణ్, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, దూలం నాగేశ్వరరావు, తలారి వెంకట్రావు, తెల్లం బాలరాజు, పుప్పాల వాసుబాబు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, జొన్నలగడ్డ పద్మావతి, పుష్ప శ్రీవాణి, కళావతి, శ్రీదేవి, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, జయమంగళ వెంకటరమణ, పోతుల సునీత, వరుదు కళ్యాణి, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, రేంజ్ డీఐజీ పాలరాజ్, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, జేసీ పి.అరుణ్‌బాబు, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, కార్పొరేషన్ల చైర్మన్లు గుబ్బల తమ్మయ్య, మధ్యాహ్నపు ఈశ్వరి, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ గంటా పద్మశ్రీ, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



జయహో జగనన్న.. దెందులూరు సభా ప్రాంగణంలో మహిళల ఆనందోత్సాహాలు



బాధితులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యేలు వాసుబాబు, అబ్బయ్యచౌదరి, తలారి వెంకట్రావు

మహిళల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): 'సర్.. మీరు జిల్లాలో పర్యటించే ప్రతిసారి వర్షం పడుతోంది. దీంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. ఈ నేపథ్యంలో మీరు తరుచూ జిల్లాకు వస్తూ వర్షాన్ని కురిపిస్తూ ఉండండి' అంటూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. దీంతో సభికులు హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా సభలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో పేదలు, మహిళల కష్టాలను చూసి 2019 ఏప్రిల్ 11న పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాల మొత్తం సొమ్మును మహిళా సంఘం పొదుపు ఖాతా ద్వారా అందిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా జిల్లాలో 39,539 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3.89 లక్షల మందికి రూ.364.39 కోట్లు అందిస్తున్నారన్నారు. మహిళల జీవితాల్లో మరిన్ని కాంతులు తీసుకువచ్చి వారి కుటుంబంలో సుస్థిర ఆదాయం రావాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు.

ట్రైనీ కలెక్టర్ చొరవతో తప్పిన ప్రమాదం

సభ అనంతరం మహిళలు తిరిగి వెళ్లే క్రమంలో దెందులూరుకు చెందిన బేతపూడి మరియమ్మపై బారికేడ్ పడటంతో ఆమెకు తీవ్ర గాయమైంది. వెంటనే స్పందించిన ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు ఆమెను ట్రైనీ కలెక్టర్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఏలూరు ఆస్పత్రి వైద్యులు హుటాహుటిన వైద్యం అందించడంతో ఆమెకు ప్రమాదం తప్పింది.

అభివృద్ధి పనులకు శ్రీకారం



డ్వాక్రా సంఘాల ఉత్పత్తులపై ఆరా తీస్తూ..

దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలో రూ.68.85 కోట్లతో నిర్మించనున్న జగన్నాథపురం ఎత్తిపోతల పథకానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. పెదవేగి మండలంలో 42 గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. రూ.61.60 కోట్లతో నిర్మించనున్న సీడబ్ల్యూఎస్ పథకానికి శంకుస్థాపన చేశారు. దెందులూరు, నూజివీడు నియోజకవర్గాల మధ్య తమ్మిలేరుపై బలివే ప్రాంతంలో రూ.18.33 కోట్లతో నిర్మించనున్న డబుల్ లైన్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. దెందులూరు మండలం విజయరాయిలో రూ.2 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. దెందులూరులో రూ.2.78 కోట్లతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. దెందులూరు నియోజకవర్గంలో రూ.9.15 కోట్లతో పలు బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్



హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంపీలు కోటగిరి శ్రీధర్, పిల్లి సుభాష్‌చంద్ర బోస్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, తెల్లం బాలరాజు, కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, దూలం నాగేశ్వరరావు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, జయమంగళ వెంకటరమణ

మూడో విడత ఆసరా రూ. 266.67 కోట్లు



లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందిస్తున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడతలో జిల్లాలోని 25,878 స్వయం సహాయక సంఘాల్లోని 2,56,389 మంది లబ్ధిదారులకు రూ.266.67 కోట్లు జమచేయనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం సీఎం జగన్ దెందులూరు నుంచి వర్చువల్ విధానంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా భీమవరం కలెక్టరేట్ నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆసరా లబ్ధిదారులకు చెక్కు అందించారు. జిల్లాలో మొదటి విడతలో 25,883 సంఘాల్లోని 2,58,830 మందికి రూ.266.71 కోట్లు, రెండో విడతలో 25,899 సంఘాల్లోని 2,58,990 మందికి రూ.267.18 కోట్లు అందించగా తాజాగా మూడో విడత మొత్తంతో కలిపి రూ.800.56 కోట్లు జమచేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా మూడో విడతలో ఆచంటలో 4,875 సంఘాల్లోని 48,591 మందికి రూ.49.10 కోట్లు, భీమవరంలో 2,924 సంఘాల్లోని 28,985 మందికి రూ.28.94 కోట్లు, నరసాపురంలో 3,243 సంఘాల్లోని 31,408 మందికి రూ.33.92 కోట్లు, పాలకొల్లులో 2,662 సంఘాల్లోని 26,965 మందికి రూ.26.45 కోట్లు, తాడేపల్లిగూడెంలో 2,897 సంఘాల్లోని 28,483 మందికి రూ.25.18 కోట్లు, తణుకులో 4,142 సంఘాల్లోని 40,137 మందికి రూ.41.42 కోట్లు, ఉండిలో 5,232 సంఘాల్లోని 51,880 మందికి రూ.62.63 కోట్లు జమయ్యాయన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహోన్నతం

ఒకరి రక్తదానంతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని, రైతులు రక్తదానం చేయడం అభినందనీయమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. టౌన్‌హాల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధికారుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారన్నారు. సుమారు 300 మంది రక్తదానం చేశారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు



భీమవరంలో టెన్నిస్ పోటీల దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని కాస్మోక్లబ్‌లో నిర్వహిస్తున్న ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీలను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి పద్మరాజు, పి.వెంకటరామరాజు, వీవీఎస్ఎస్ వర్మ, కె.రాంబాబు పర్యవేక్షించారు. శనివారం జరిగిన పోటీల్లో 65+ ఫైనల్స్ డబుల్స్‌లో సేతు (సేలం), సన్యాసిరాజు (విజయనగరం)పై తులసీ రామ్ (మైసూర్), పాల్ చంద్ర (బెంగుళూరు) గెలుపొందారు. 70+ ఫైనల్స్ డబుల్స్ సాయిరాం (హైదరాబాద్), అశోక్‌రెడ్డి (కడప)పై రాంబాబు (హైదరాబాద్), రాధాకృష్ణ (విజయకృష్ణ) విజయం సాధించారు.

ఆక్వా విద్యుత్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేయండి

సాక్షి, భీమవరం: ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందించేందుకు ప్రభుత్వం వారికి మరొక అవకాశం కల్పించిందని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎల్ఎన్ రాజు చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగులో గతంలో విద్యుత్ సబ్సిడీ పొంది వివిధ కారణాల వల్ల సబ్సిడీ కోల్పోయిన రైతులు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతులు ఆక్వా సాగుకు అనుమతి పొందిన సర్టిఫికెట్‌తో వారికి దగ్గరలోని సచివాలయంలోని మత్స్య సహాయకులకు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజు కోరారు.

గంటల వ్యవధిలోనే మామ, కోడలు మృతి

- గుండెపోటుతో మామ మృతి.. రాత్రంతా భౌతికకాయం వద్ద కోడలు జాగారం
- మరుసటిరోజు ఉదయం ఆరోగ్యం క్షీణించి మృత్యుఒడికి
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు.. జిన్నూరులో ఘటన

పోడూరు: ఒకే కుటుంబంలో మామ, కోడలు కొద్దిగంటల వ్యవధిలోనే మృతి చెందిన విషాద ఘటన పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో జరిగింది. గ్రామంలోని పెదపేటకు చెందిన రిటైర్డ్ వెటర్నరీ అసిస్టెంట్ కాటం వెంకట్రావు (85) శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి శనివారం అంత్యక్రియలు చేయడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. రాత్రంతా కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు భౌతికకాయం వద్దే ఉన్నారు. ఈ క్రమంలో



కాటం వెంకట్రావు



కోడలు కిరణ్మయి

వెంకట్రావు చిన్న కోడలు కిరణ్మయి (38) రాత్రంతా ఆహారం తీసుకోకుండా మామగారి భౌతికకాయం వద్దే ఉండడంతో శనివారం ఉదయానికి బాగా నీరస పడ్డారు. ఉదయం 6.30 గంటల సమయంలో ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆమెను పాలకొల్లులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కొద్దిగంటల వ్యవధిలోనే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. వెంకట్రావు చిన్న కుమారుడు మాణిక్యాలరావు ఒకవైపు తండ్రి చనిపోయిన బాధలో ఉండగా, ఊహించని రీతిలో భార్య కూడా మృత్యు ఒడికి చేరడంతో కన్నీరుమున్నీరయ్యారు. కిరణ్మయి తణుకు మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా, ఆమె భర్త మాణిక్యాలరావు ఓ ప్రైవేటు కళాశాలలో పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె జ్యోత్స్న చంద్రిక ఇంటర్ మొదటి సంవత్సరం, చిన్న కుమార్తె వర్షిత శ్రీజ తొమ్మిదో తరగతి చదువుతున్నారు. మృతుడు వెంకట్రావుకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, తణుకు కళాశాల నుంచి తోటి అధ్యాపకులు, విద్యార్థులు తరలివచ్చి వెంకట్రావు, కిరణ్మయి భౌతికకాయాలను సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. వెంకట్రావు భౌతికకాయానికి ఉదయం 11 గంటలకు, కిరణ్మయి భౌతికకాయానికి సాయంత్రం ఐదు గంటలకు అంతక్రియలు నిర్వహించారు.

ఆలయంలో రికార్డుల దగ్ధంపై విచారణ

నూజివీడు : గొల్లపల్లిలో వేంచేసియున్న శ్రీరఘునాథస్వామి ఆలయానికి సంబంధించిన రికార్డులను ఆగంతకులు దగ్ధం చేసిన ఘటనపై శనివారం దేవదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులు ఆలయం వద్ద విచారణ నిర్వహించారు. రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్‌బాబు, కాకినాడ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, ఏలూరు అసిస్టెంట్ కమిషనర్ చెన్ను రంగారావు ఈ విచారణ జరిపారు. దీనిలో భాగంగా ఆలయ సిబ్బందిని, అర్చకులను, గ్రామస్తులను విచారించి వివరాలు సేకరించారు. టెండర్ల వివాదాలు, రికార్డుల దగ్ధం తదితర వాటన్నింటికీ ఆలయ ఈవో విశ్వేశ్వరరావు కారణమని గ్రామస్తులు ఆరోపించారు. ఈ సందర్భంగా దగ్ధమైన రికార్డులు రామకృష్ణ ట్రస్టుకు చెందినవిగాను, ఆలయానికి సంబంధించిన దాదాపు 3వేల ఎకరాలకు సంబంధించిన రికార్డులన్నీ భద్రంగానే ఉన్నట్లు గుర్తించారు. మాజీ సర్పంచ్, గ్రామ పెద్ద ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు పలు వివరాలను అధికారులకు వివరించారు. ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్ క్యాడర్ అధికారిని నియమించాలని కోరారు. రికార్డులను దగ్ధం చేసిన వారిని శిక్షించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



గొల్లపల్లిలోని శ్రీరఘునాథస్వామి ఆలయంలో విచారణ చేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఇంటర్ పరీక్షలకు 95 శాతం హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 పరీక్షలకు కేటాయించిన 106 కేంద్రాల్లో మొత్తం 36,500 మంది విద్యార్థులకు గాను 34,580 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 11,796 మంది జనరల్ విద్యార్థులకు గాను 11,278 మంది హాజరు కాగా 567 మంది గైర్హాజరయ్యారు. అలాగే 2011 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1682 మంది హాజరు కాగా 329 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 15,776 మంది జనరల్ విద్యార్థులకు గాను 15,209 మంది హాజరుకాగా 567 మంది గైర్హాజరయ్యారు. 1729 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1,510 మంది హాజరు కాగా 219 మంది గైర్హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 4,317 మంది జనరల్ విద్యార్థులకు గాను 4,149 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారు. అలాగే 871 ఒకేషనల్ విద్యార్థులకు గాను 752 మంది హాజరు కాగా 119 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద విద్యార్థుల హాజరు 95 శాతంగా నమోదైంది. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు.

ఇద్దరు సెక్యూరిటీ గార్డుల తొలగింపు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఒక భక్తుడి నుంచి వివాహ టికెట్లు నిమిత్తం రూ.వెయ్యి నగదును అక్రమంగా వసూలు చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తొలగించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు శనివారం చెప్పారు. ఇదిలా ఉంటే విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్ (ఎస్ఓ)పై సైతం చర్యలు తీసుకునేందుకు సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది జనవరిలో కొండపైన కేశఖండనశాలలో దొంగతనం జరగడం, అన్నదాన భవనం వద్ద పక్షుల పార్కులోని పావురాలు మాయమవడం సెక్యూరిటీ డొల్లతనానికి నిదర్శనంగా అధికారులు భావిస్తున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

వీరవాసరం: జాతీయ రహదారిపై నందమూరుగరువు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెర్కిపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు వేండ్ర పల్లారావు, వేండ్ర వెంకటలక్ష్మి నందమూరు గరువు పెట్రోలు బంకు ఎదురుగా కొబ్బరి బొండాల దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం దుకాణం వద్దకు పెర్కిపాలెం నుంచి నందమూరు గరువుకు ద్విచక్రవాహనంపై వస్తూ పెట్రోలు బంకు సమీపంలో రహదారి దాటుతుండగా, వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి (45) ఘటనా స్థలంలో మృతి చెందగా గాయపడిన పల్లారావును చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై బాధితుడు పల్లారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రంగారావునాయక్ తెలిపారు.



ఘటనా స్థలంలో వేండ్ర వెంకటలక్ష్మి మృతదేహం

నేడు రోడ్డు కం రైలు వంతెనపై రాకపోకలు బంద్

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై ఫుట్‌పాత్‌లు, హ్యాండ్ రైలింగ్‌ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు వాహన రాకపోకలను నిలిపివేయనున్నట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్‌బీవీ రెడ్డి తెలిపారు. భారీ క్రేన్‌ల సాయంతో మరమ్మతులు చేపట్టనున్నందున ట్రాఫిక్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వంతెనకు రెండు వైపులా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. కొవ్వూరు-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలు సాగించే వాహనచోదకులు గామన్ ఇండియా బ్రిడ్జి, ధవళేశ్వరం ఆనకట్ట మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


ఉపాధి పనుల్లో రూ.7.39 లక్షల దుర్వినియోగం



వీరవాసరంలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఉపాధి హామీ పథకంలో మండలంలో చేసిన పలు పనుల్లో రూ.7.39 లక్షలు దుర్వినియోగం అయ్యాయని సోషల్ ఆడిట్లో అధికారులు తేల్చారు. వీరవాసరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ కార్యక్రమం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ను బూచీగా చూపి గ్రామాల్లో కనీసం గ్రామ సభలు కూడా నిర్వహించకుండా గ్రామాల్లో సోషల్ ఆడిట్ తనిఖీలు నిర్వహించడంపై పలువురు ప్రజాప్రతినిధులు పెదవి విరిచారు. ప్రతి గ్రామంలో పనుల్లో అవకతవకలుగా జరిగాయని, వీటిపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించకపోవడాన్ని తప్పుబట్టారు. ఇంకా పెద్దమొత్తంలో నిధులు గోల్‌మాల్ జరిగి ఉంటుందని, దీనిలో అధికారుల పాత్ర ఉందనే అనుమానాలను వ్యక్తం చేశారు. రెవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటగా, వాటిల్లో కనీసం 50 శాతం కూడా బతకలేదని గ్రామస్తులు ఆరోపించారు. మండలంలోని గ్రామాల్లో తిరిగి గ్రామసభలు నిర్వహించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి, గ్రామీణ ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌ను పూర్తి చేయాలనే ప్రజలు డిమాండ్ చేశారు. పీడీ రాజేశ్వరావు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, టీపీ సుధీర్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ద్వేషం కాదు.. మానవత్వం భావితరాలకు అందాలి




కొత్త పరిమళం నాటికలోని దృశ్యం

తాడేపల్లిగూడెం: ద్వేషం మనిషికైనా, దేశానికైనా మంచిది కాదు. చివరికి అనర్థమే మిగులుతుంది. అందుకే మానవత్వం, విశ్వరూప సౌందర్యం.. అది పంచిన కొత్త పరిమళంతో హద్దులు, సరిహద్దులు లేని అందమైన ప్రపంచం భావితరాలకు అందాలని, అందించాలనే సందేశాన్ని కొత్త పరిమళం నాటిక ద్వారా ఇచ్చారు. బీవీఆర్ కళాకేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 30వ జాతీయ ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన నాటికల్లో సున్నితమైన అంశాలను స్పృశించారు. జటిలమైన, కొత్త టర్న్ తీసుకుంటున్న సంబంధాల ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలకు చూపే పరిష్కారాలను ఈ నాటికలో చూపించారు. ఇండియా - పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో ప్రజలు క్షణక్షణం పడే యాతనను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ బంధాలు విలువను ఎలా పటిష్టపర్చుకోవాలో వివరించారు. శ్రీకాకుళం జిల్లా బొరివంక ప్రాంతానికి చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సేవా సంఘం ఈ నాటికను ప్రదర్శించింది.

టెక్నాలజీ మాయలో పడొద్దు

ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారు ప్రదర్శించిన ప్రక్షాళన నాటికలో టెక్నాలజీ మాయలో పడితే ఉత్పన్నమయ్యే పెనుప్రమాదాలను వివరించారు. రోజురోజుకి ఆడవాళ్లపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయి. ప్రపంచీకరణ జనానికి మేలు చేసిందా.. కీడు చేసిందా అర్థం కాని పరిస్థితి. టెక్నాలజీ మాయలో పడి యూత్ మొత్తం విలువలు మర్చిపోతోంది. ఎంతో మంది అమ్మాయిల జీవితాలను బలితీసుకుంటున్న కలుపుమొక్కలను ఏరిపారవేసి సమాజాన్ని ప్రక్షాళన చేయాలనే సందేశాన్ని ప్రక్షాళన నాటిక ద్వారా అందించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్ పేపర్లు



స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరచేందుకు వచ్చిన టెన్త్ పరీక్షా పేపర్లు

ఆకివీడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరచేందుకు పదో తరగతి పరీక్షా పేపర్ల సెట్-1 శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆకివీడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. 3.30 గంటలకు సెట్-1 పేపర్లను చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారుల సమక్షంలో భద్రపరిచి సీజ్ చేశారు. 8 సబ్జెక్టులకు సంబంధించిన సెట్-1 పేపర్లు వచ్చాయని రూట్ అధికారి, ఎంఈఓ ఎ.రవీంద్ర చెప్పారు. మండలంలోని ఆకివీడు జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర), చినకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, నారాయణ, సెంట్ ఎలోషియస్ విద్యా సంస్థల్లో పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేశారని చెప్పారు. మండలంలోని వివిధ జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 782 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన చెప్పారు.

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో ఎనిమిది కేంద్రాల్లో శనివారం ప్రశాతంగా జరిగాయి. ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 పరీక్షలు జరిగాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 2,514మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,413 మంది పరీక్షలు రాశారు. 101 మంది పరీక్షలకు హాజరు కాలేదు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పరిశీలించారు.

అనర్హత వేటు ఉపసంహరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాహుల్ గాంధీ పై పార్లమెంట్‌లో అనర్హత వేటును వెంటనే ఉపసంహరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జి డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన నివాసం వద్ద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితువుపలికారు. దిగువ కోర్టులు ఇచ్చిన తీర్పులకు సంబంధించి పై కోర్టులకు అప్పీల్ చేసుకునే అవకాశాలు ఉన్నాయని, ఈ లోపులో పార్లమెంట్‌లో రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరైనది కాదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాహుల్ గాంధీపై కోర్టు తీర్పుని స్వాగతిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినం బాలకృష్ణలు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై జిల్లా కోర్టు నిర్ణయంతో దేశంలోని చట్టం, రాజ్యాంగం అత్యున్నతమని, పౌరులు అందరు సమానులే అని తేటతెల్లం చేస్తుందన్నారు. ఓబీసీలపై చిన్నచూపు విధానాలను మానుకోవాలని, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఓబీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్ ఎదుట హమాలీల ధర్నా



తణుకులో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు: ఏపీ సీడ్స్ హమాలీ కార్మికుల పొట్ట కొట్టే టెండర్ విధానం రద్దు చేసి పాత పద్ధతి లోనే అగ్రిమెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామిలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీ సీడ్స్ వద్ద టెండర్ విధానం వ్యతిరేకిస్తూ హమాలీ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీలు 60 ఏళ్ల అగ్రిమెంట్ విధానంలో పని చేస్తున్నారని టెండర్ విధానం వల్ల సుమారు 30 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. పాత పాద్ధతిలోనే కొనసాగించే వరకు సీఐటీయూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గార రంగారావు, పి.దక్షిణామూర్తి, రామకృష్ణ, శ్రీహరి, మంగ, నాగమణి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన టెక్‌యు ఫోరియా



వాసవీలో టెక్‌యుఫోరియా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల పాలకవర్గ సభ్యులు

తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో గడచిన మూడు రోజులుగా సాగుతున్న సాంకేతిక సింపోజియం టెక్‌యు ఫోరియా 2కె23 శనివారం సాయంత్రం ముగిసింది. విద్యార్థులు ఆలోచింపచేసే ప్రాజెక్టులతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అబ్బురపర్చారు. డిగ్రీ చదువుకొనే సమయంలో మనం ఏం నేర్చుకున్నాం అన్నదే మన జీవితాలను ప్రభావితం చేస్తుందని వర్ధమాన యుట్యూబర్ రవిశివతేజ అన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరూ విజేతలేనని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు అన్నారు. ఉత్తమంగా నిలిచిన వారికి బహుమతులు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి

ఉపాధి హామీ పనుల తనిఖీ

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను మూడు లక్షల 43వేల 203 పనిదినాలు కల్పించడం జరిగిందని ఉపాధి హామీ పథకం ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని మారంపల్లి, ఆరుళ్ల గ్రామాల్లో ఉపాధి పని ప్రాంతాలను ఆయన తనిఖీ చేశారు. ఏపీవో ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నాలుగు లక్షల 59వేల 120 పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 3.43లక్షల పనిదినాలు కల్పించి లక్ష్యాన్ని 75 శాతం పూర్తి చేశామన్నారు. వీలైనంత ఎక్కువ మందికి పని దినాలు కల్పించి లక్ష్యాన్ని సాధిస్తామన్నారు.

చక్కని ప్రణాళికతో పదండి

- పదోతరగతి పరీక్షల్లో ఒత్తిడి వద్దు
- ఏప్రిల్ 3 నుంచి పరీక్షలకు ఏర్పాట్లు



నిడమర్రులో పదో తరగతి విద్యార్థులను చదివిస్తున్న హెచ్‌ఎం శేషగిరి, ఏంఈఓ



పెంటపాడులో పబ్లిక్ పరీక్షల కోసం చదువుకొంటున్న విద్యార్థినులు

పెంటపాడు: ప్రతీ విద్యార్థికి పదోతరగతి ప్రతిష్ఠమైన పునాది. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు ఏడాది పొడవునా ఎంతో కష్టపడి చదువుతారు. తీరా పరీక్షకు హాజరయ్యే సమయంలో తీవ్ర ఒత్తిడితో చదివిన అంశాలు మరచిపోతుంటారు. అలాంటివి జరగకుండా పదోతరగతి విద్యార్థులు చక్కని ప్రణాళికతో సాగితే విజయం వరిస్తుందని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్నారు. దీనికి గాను తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 17 పరీక్షా కేంద్రాలు కేటాయించారు. ఇక్కడ సుమారు 3,655 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పెంటపాడు, గూడెం రూరల్ మండలంలో మొత్తం 28 ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇది ఇలా ఉంటే గతంలో ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లు ఉండేవి. కాగా ఈ సారి ప్రతి సబెక్టుకు ఒక పేపరు చొప్పున ఆరు పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. పరీక్షలకు గడువు సమీపించడంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పరీక్షల సమయంలో కొన్ని మెలకువలు పాటిస్తే ఒత్తిడిన జయించవ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

అవగాహన ... సాధన

ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులు అవగాహనతో సాధన చేయాలి. తద్వారా ఆయా పాఠ్యాంశాలపై పూర్తి పట్టు సాధించాలి. ఉపాధ్యాయుల సూచనల మేరకు నడచుకోవాలి. తెలుగు సబ్జెక్టును కొందరు అశ్రద్ధ చేస్తుంటారు. అలా కాకుండా దీనిపైనా శ్రద్ధ వహించాలి. మార్కుల సాధనలో ప్రతి మార్కు కీలకమని గ్రహించాలి. హిందీలో పేరాగ్రాఫ్ ప్రశ్నలు బాగా చదివి రాయాలి. ఇంగ్లీషు ప్రాజెక్టులను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొంటే సమాధానాలు సులభంగా రాయవచ్చు. సైన్స్, సోషల్, పరీక్షల్లో మంచి మార్కులు పొందాలంటే ముందు నుంచి పక్కాగా చదవాలి. గణితంలో అరమార్కు, మార్కు బిట్లపై దృష్టిపెట్టాలి. వాస్తవ సంఖ్యల ఛాప్టర్ ద్వారా మార్కులు సులభంగా పొందవచ్చు. పరీక్ష సమయానికి ముందు కొత్త ప్రశ్నలు చదవడం కంటే చదివిన వాటిని తిరిగి చూసుకొంటే మంచిది. ప్రశ్నపత్రంలో ముందుగా బాగా వచ్చిన సమాధానాలను రాయాలి. తద్వారా మిగతా వాటిని రాయడం ద్వారా ఒత్తిడి పెరగదు.

అన్ని ఏర్పాట్లూ చేశాం



పదోతరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లూ చేశాం. భయం లేకండా విద్యార్థులు పరీక్షలు రాయాలి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలి. మండలంలో పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

–ఏవీఎస్‌వీ ప్రసాద్, హెచ్‌ఎం బేసిక్‌స్కూల్ పెంటపాడు

ముందే చేరుకోవాలి



విద్యార్థులు ఏ మాత్రం ఒత్తిడి లేకుండా సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఇప్పటివరకు చదివిన అంశాలనే తిరిగి రివిజన్ చేసుకోవాలి. ప్రశ్న పత్రంలో ఏ ప్రశ్న ఇచ్చినా అది తామే ఏడాది అంతా కష్టపడి నేర్చుకొన్న అంశమే అని గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు సమాదానం రాసే ప్రయత్నం చేయాలి. పరీక్ష హాల్‌కు నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాలి.

–యర్రంశెట్టి శేషగిరిరావు, నిడమర్రు, జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలి

పెంటపాడు: తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. శనివారం పెంటపాడులో రెండోరోజు ఎల్‌టీసీ శిక్షణా కేంద్రాన్ని నిర్వహించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేయకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తాడేపల్లి సూర్యకళ, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, తణుకు మండలంలోని తేతలి, కొమరవరం, ఇరగవరం మండలం నుంచి రేలంగి, కావలిపురం, పెనుగొండ మండలం నుంచి వడలి, దేవ, గ్రామాల సర్పంచ్‌లు, ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ విస్తరణాధికారులు, కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి తెల్లవారు జామున సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపారు. ఉదయం అర్చనలు జరిపి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలి



గణితంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు



పెంటపాడు కృష్ణవాసవి ఐడియల్ స్కూలు వద్ద విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే వరకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. శనివారం సాయంత్రం అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికా బద్దంగా రివిజన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులచే 40కి పైగా ప్రదర్శించిన వివిధ నృత్య ప్రదర్శనలు, నాటికలు, పిరమిడ్, యోగా, పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ఉపాధ్యాయినిలు ఎస్‌కే షర్మిల, యామిని, పీడీ సోమయాజులు విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల నివేదికను హెచ్‌ఎం దత్ చదివి వినిపించారు. ముఖ్య అతిధిగా హాజరైన మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాలలో జరిగిన గణిత దినోత్సవంలో భాగంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్‌ను అందజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి

పెంటపాడు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని తప్పక శ్రమించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, రెడ్డి సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వేణులు కోరారు. పెంటపాడు కృష్ణవాసవి ఐడియల్ స్కూల్ వార్షికోత్సవ వేడుక శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



దువ్వలో పోషణ్ పక్వాడా, బాలికల వివాహ వయస్స పై అవగాహనా ర్యాలీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని తణుకు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని బాలికల వివాహ వయస్సు, పోషకాహారం, పిల్లల పట్ల బాధ్యత, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై నిర్వహించిన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొని బాలికల సంరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల్య వివాహాలు జరిగితే తీసుకునే చట్ట పరమైన చర్యల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో టీఎస్ మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ వెంకటలక్ష్మీ, కె కుమారి, సచివాలయ ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, డ్వాక్రా సీసీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

తణుకులో పోషణ్ పక్వాడా...

తణుకు పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ పాఠశాలలో గల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అరుణకుమారి, పాఠశాల హెచ్‌ఎం టీ రాజకుమార్‌లు పాల్గొని అధిక పోషకాలు ఇచ్చే రాగిపిండి, జొన్నపిండి, అటుకులు, ఎండు ఖర్జూరం, బెల్లం, చిక్కీలు ఉపయోగం గురించి వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జగన్నాథపురం సర్పంచ్



కొట్టు సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగన్నాథపురం సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల కోర్టు ఇచ్చిన తీర్పు అనుసరించి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు జగన్నాథపురం సర్పంచ్‌గా ఉండ్రాజవరపు చంద్రిక బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆమె కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ నార్ని నాగులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, ఉండ్రాజవరపు రాజు, ముప్పిడి మధు, యర్రంశెట్టి బసవయ్య, తులా మస్తాన్ తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితో క్షయ నివారణ



తణుకులో టీబీ రోగులకు పోషకాహారాన్ని అందిస్తున్న డా. దుర్గామహేశ్వరరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పగడాల సూర్యనారాయణ

తణుకు అర్బన్: క్షయ మహమ్మారిని నిర్మూలించేందుకు సమష్టి కృషి చేయాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గుతున్నప్పుడు కఫంలో రక్తం పడడం వంటి లక్షణాలు టీబీకి సంకేతాలని అన్నారు. ప్రభుత్వం మందులు ఉచితంగా అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తణుకు ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్ సౌజన్యంతో రోగులకు పోషకాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యకుమారి, డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, టీబీ విభాగ ఉద్యోగులు చైతన్య, పంజా రవిబాబు, చినబాబు, రాంబాబు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్షయ నిర్మూలనకు అంతా సమిష్టిగా కృషి చేయాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.పగడాల సూర్యనారాయణ, కెఎఫ్ ఇండస్ట్రీస్ స్వాభిమాన్ ఫౌండేషన్ మెయింటినెన్స్ ఇన్‌చార్జి వి.శ్రీనివాస్ లు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో అవగాహన సదస్సు జరిగింది. వక్తలు మాట్లాడుతూ క్షయ రోగులు మంచి అలవాట్లతో సక్రమమైన పద్ధతిలో డాక్టర్లు ఇచ్చిన మందులు వాడాలని, పౌష్టికాహారం, సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా టీబీని ఎదరించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు పౌష్టికాహారం, గ్రుడ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సాంబశివరావు, సాంబ శివ కృష్ణ నాయక్, కార్తీక్, కీర్తి, గిరిబాబు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



అత్తిలిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

అత్తిలి: మూడవ విడత వైఎస్సార్ ఆసరా నిధులను శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాలో జమచేసిన సందర్భంలో కృతజ్ఞతాపూర్వకంగా డ్వాక్రా మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శనివారం సాయంత్రం అత్తిలి పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ వీధిలో చైతన్య వీఓ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళలకు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు క్రమం తప్పకుండా మూడవ విడత రుణ మాఫీ డబ్బులు తమఖాతాలో జమ చేశారని డ్వాక్రా మహిళలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఓ గౌరీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గూడెం టీడీపీలో అంతర్గత విభేదాలు



నాయకుల మాటలకు నిరసన తెలియజేస్తున్న తెలుగు యువత నాయకులు

తాడేపల్లిగూడెం: నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో శనివారం తెలుగుయువత గలాటా చేశారు. తెలుగుయువత నాయకుడు మద్దిపాటి ధర్మేంద్రను ఉద్దేశించి మాగంటి ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఇద్దరు నాయకులు మాట్లాడటం గందరగోళానికి దారితీసింది. ధర్మేంద్ర సమావేశంలో లేనప్పటికి అతని వర్గీయులుగా భావిస్తున్న యువకులు నాయకుల మాటలకు ఆగ్రహం వ్యక్తం చేసి వేదిక కింద నుంచి వేదికపైకి వెళ్లి వాగ్వావాదానికి దిగారు. ఇదే తరుణంలో రాచర్లకు చెందిన గిరి, పెంటపాడుకు చెందిన దాసరి అప్పన్నలు గొడవ చేస్తున్న వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఉగాది వేడుకల సందర్భంగా ధర్మేంద్ర ఇదే పార్టీకి చెందిన ఇటీవలి కాలంలో దూరంగా ఉంటున్న నాయకుడి ఇంటివద్ద జరిగిన వేడుకకు హాజరయ్యారు. ధర్మేంద్ర పై గుర్రుగా కొందరు నాయకులు ప్రస్తుత నాయకత్వానికి ధర్మేంద్ర వ్యతిరేకంగా ఉన్నాడని, అతనిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలనే డిమాండ్ చేశారు. దీంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. వేదికపై టీడీపి పెద్దనాయకులున్నా, విషయం పట్టనట్టుగా కూర్చున్నారు. వారం రోజుల నుంచి అంతర్గతంగా టీడీపీలో రగులుతున్న వ్యవహారం శనివారం ఘటనతో రాజుకుంటున్నట్టుగా కనపడుతోంది.

శశిలో ముగిసిన జాతీయ సెమినార్



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: జీవితంలో స్మార్ట్ మెటీరియల్స్ ప్రాధాన్యత పెరిగిందని జేఎన్‌టీయు హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రాంటియర్ ఆఫ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ స్మార్ట్ మెటీరియల్స్ ఫర్ టెక్నోలాజికల్ అప్లికేషన్స్ 2023 కార్యక్రమంలో శనివారం ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. స్మార్ట్ మెటీరియల్స్ ప్రాధాన్యత గురించి , ఉపయోగాల గురించి కృష్ణా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ వి.వెంకటరాము, విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ పి.బ్రహ్మానందంలు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్, కన్వీనర్ సీహెచ్.శ్రీనివాసు, కో కన్వీనర్ జి.ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టివి.రఘు తదితరులు పాల్గొన్నారు.